క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో ఆపరేషన్ డివిజన్ పరిధిలో విద్యుత్ లైన్ మరమ్మతు పనులు నిర్వహించనున్నారు. ఈ కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఈఈ మునిచంద్ర తెలిపారు. చిత్తూరు నగరం, రూరల్స్, గుడిపాల, యాదమరి, బంగారుపాళ్యం, ఐరాల, తవణంపల్లె ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు మార్పును గమనించాల్సిందిగా కోరారు.

బిల్లుల చెల్లింపులకు రద్దీ


కరెంటు బిల్లు కట్టడానికి క్యూలో ఉన్న వినియోగదారులు

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ బిల్లుల చెల్లింపుల కేంద్రాలు శుక్రవారం వినియోగదారులతో రద్దీగా మారింది. స్థానిక గాంధీరోడ్డులోని ట్రాన్స్‌కో అర్బన్ ఈఆర్వో కార్యాలయం కిటకిటలాడింది. వరుసగా రెండో శనివారం, ఆదివారం, సోమవారం, మంగళవారం సెలవులు వచ్చాయి. దీనికితోడు సంక్రాంతి పండుగకు సొంతవూరికి వెళ్లే వారి సంఖ్య ఎక్కువ. దీంతో డివిజన్ పరిధిలో వినియోగదారులు ముందస్తుగా కరెంటు బిల్లులను కట్టడానికి క్యూలో వేచి ఉండి కట్టారు.

రెవెన్యూ సమస్యలు సకాలంలో పరిష్కరించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్

బంగారుపాళెం: మండలంలో రెవెన్యూ సదస్సులు, రీసర్వే కార్యక్రమంలో ప్రజల నుంచి సమస్యలపై వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం వీఆర్‌ఓలు, విలేజ్ సర్వేయర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఆయా గ్రామాల్లో వచ్చిన అర్జీలను క్షేత్ర స్థాయిలోకి వెళ్లి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. రైతులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డీటీ బాబు, సర్వేయర్ లావణ్య, ఆర్ఐ మధుసూదన్ పాల్గొన్నారు.

ఆర్ఎంపీలు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

యాదమరి (కాణిపాకం): ఆర్ఎంపీ వైద్యులు నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని వైద్యాధికారి సురేఖ హెచ్చరించారు. యాదమరిలోని ఆర్ముగం క్లినిక్‌ను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నపిల్లలు, గర్భిణులకు వైద్యం అందించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సూదిమందులు, సెలైన్ పెట్టించడం సరికాదని మండిపడ్డారు. ఇకపై ఇలా చేస్తే కేసు పెడతామని ఆమె పేర్కొన్నారు. ఆమె వెంట వైద్య, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని దివిటివారిపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో 70 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. హెచ్ఎంపీవీ వైరస్‌పై ప్రజలకు అవగాహన కల్పించి, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. దగ్గు, జలుబుతో పాటు, శ్వాస తీసుకోవడం ఇబ్బందికరంగా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్ పాల్గొన్నారు.

చిత్తూరు: క్యూలో వేచిఉన్న భక్తులు, గోవిందరాజుల గుట్టలో శ్రీవారి పాదాలకు పూజలు చేస్తున్న భక్తులు




తవణంపల్లె: ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వైకుంఠ ద్వారం, **బంగారుపాళెం:** నలగాంపల్లెలో అన్నదానం, గోవింద రాజులస్వామికి పూజలు చేస్తున్న భక్తులు






బంగారుపాళెం: వేంకటేశ్వరస్వామి దర్శనానికి క్యూ

సర్వ పాపహరణం.. వైకుంఠ ద్వార దర్శనం


చిత్తూరు: వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న భక్తులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశిని ఘనంగా జరుపుకున్నారు. ఈశ్వరగుడివీధిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం అభిషేకం, తోమాల సేవ నిర్వహించారు. మూలవిరాట్‌ను, వైకుంఠ ద్వారంలో ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. దీంతో ఉదయం నుంచి ఆలయానికి భక్తులు పోటెత్తారు. రాములుగుడివీధిలోని కోదండరామస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామి వారు విశేష అలంకరణలో భక్తులకు అభయమిచ్చారు. కట్టమంచిలోని వరదరాజులస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పూజలు కన్నుల పండువగా చేపట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది.

గోవింద రాజుల గుట్టలో వైకుంఠ ఏకాదశి

చిత్తూరు మండలం టి.వేపనపల్లి సమీపంలో గోవిందరాజుల గుట్టలో శుక్రవారం వైకుంఠ ఏకాదశిని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. గుట్టలోని శ్రీవారి పాదాలకు ప్రత్యేక పూజలు చేసి పాలాభిషేకం చేశారు. చుట్టుపక్కల గ్రామస్తులు భజన కార్యక్రమాలతో అలరించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో తాళంబేడు సర్పంచ్ అమరనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

గరుడోత్సవం



యాదమరి (కాణిపాకం): యాదమరి మండలంలోని వెలసిన శ్రీవరదరాజుల స్వామి ఆలయంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశిని నేత్రపరపర్వంగా నిర్వహించారు. వేకువజామున వేదపండితులు స్వామి వారిని సుప్రభాత సేవలో మేల్కొల్పి మూలవిరాట్‌కు విశేష పూజలు చేశారు. తర్వాత పుష్పాలంకరణ చేసి భక్తులకు దర్శనం, అర్చన సేవలు చేశారు. అనంతరం గరుడోత్సవాన్ని అంగరంగవైభంగా చేపట్టారు. ఉత్సవమూర్తి గరుడ వాహనంపై విరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. ఈ సేవను తిలకించేందుకు వారు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి

ఐరాల: మండలంలోని పొలకలలో వెలిసిన శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి వారి ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలంకారణతో సుందరంగా ముస్తాబు చేశారు. అర్చకులు ఉదయం స్వామి వారికి సుగంధ పరిమళ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఉత్తర ద్వారానికి ప్రత్యేక పూజలు చేసి, స్వామి వారికి కర్పూర హారతులను సమర్పించి భక్తులకు ఉత్తర ద్వారం గుండా స్వామివారి దర్శనభాగ్యం కల్పించారు. అర్చకులు శ్రీ లక్ష్మీ సమేత నారాయణస్వామి వారికి తిరుప్పావై సేవ, అర్చనలు, పూజలు చేసి స్వామి వారికి పంచ కలల హారతులను సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి పూజలు

బంగారుపాళెం: మండలంలోని వివిధ ఆలయాల్లో శుక్రవారం వైకుంఠ ఏకాదశి పూజలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో ఉదయం నుంచి భక్తుల సందడి నెలకొంది. మండలంలోని నలగాంపల్లె దేవర కొండపై వెలసిన శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. స్వయంభు శ్రీమొగిలీశ్వరాలయం, తిమ్మోజుపల్లెలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, వజ్రాలపురం బోయకొండ గంగమ్మ, మండల కేంద్రంలోని శ్రీముత్యాలమ్మ దేవాలయాలతో పాటుగా గ్రామాల్లోని వివిధ ఆలయాల్లో భక్తి శ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి పూజలను ఘనంగా నిర్వహించారు.


ఐరాల: ముస్తాబైన లక్ష్మీనారాయణ స్వామి ఆలయం

సీతారాముల గ్రామోత్సవం

మొగిలివెంకటగిరి గ్రామంలోని పురాతన కోదండ రామాలయంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం సీతారాముల విగ్రహాలకు అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి గ్రామ పుర వీధుల్లో మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగించారు. భక్తులు కొబ్బరికాయలు సమర్పించుకున్నారు.

కోదండరామాలయంలో ..

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు కోదండ రామాలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వైకుంఠ ద్వారం ద్వారా భక్తులకు దర్శనం కల్పించారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయంలో సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామికి అర్చకులు శాస్త్రోక్తంగా అభిషేకం చేశారు. స్వామికి ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వైకుంఠ ద్వారం ద్వారా వెళ్లి స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి


పొంగళ్లు పెడుతున్న ఉపాధ్యాయినులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబం సంక్రాంతి పండుగ అని వైస్ ఎంపీపీ రంజని అన్నారు. చిత్తూరు మండలం తుమ్మిందలోని విజ్ఞానతేజ స్కూల్లో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. టీచర్లు పొంగళ్లు పెట్టి సంక్రాంతి ప్రాముఖ్యతను పిల్లలకు వివరించారు. పలు రకాల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ నిర్వాహకులు టి.కుమార్, టీచర్లు నవమణి, జయకుమార్, తేజ, ప్రియ, నదియ, మీనా, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం స్వామి వివేకానంద



మాట్లాడుతున్న ప్రదీప్


ర్యాలీ చేస్తున్న ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు

గుడిపాల: యువతకు ఆదర్శం స్వామి వివేకానంద అని చిత్తూరు నెహ్రూ యువకేంద్ర సమన్వయకర్త ప్రదీప్ అన్నారు. స్వామి వివేకానంద జయంతి ముందస్తుగా సీఎన్ఆర్ కళాశాలలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువతకు ఆదర్శం వివేకానంద అన్నారు. రామకృష్ణ మఠాన్ని స్థాపించి దాని ద్వారా భారత యువతకు దిశానిర్దేశం చేయడం జరిగిందన్నారు. విశిష్ట అతిథులుగా విచ్చేసిన రచయిత, కవి, గురజాడ ఫౌండేషన్ అధ్యక్షులు పసపల హరిక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులందరూ స్వామి వివేకానంద జీవితచరిత్ర పుస్తకాలు చదివి జీవితంలో మహోన్నతమైన శిఖరానికి ఎదగాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ లోకేష్ మాట్లాడుతూ పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్టుగా చిన్నప్పటినుంచే అతనికి నిస్వార్థగుణం, ఔదార్య గుణాలు అలవడ్డాయన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు స్వామి వివేకానంద సూక్తుల నినాదంతో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రామచంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అర్జున్, అధ్యాపకులు రంజిత్‌కుమార్, హేమంత్‌కుమార్, మీనాకుమారి, రేవతి, గాయత్రి, శ్వేత, ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖాళీగా ఆర్అండ్‌బీ కార్యాలయం


ఆర్ అండ్ బీ కార్యాలయం


ఖాళీగా ఉన్న డీఈ కార్యాలయం

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ శాఖలో కీలకమైన ఆర్అండ్‌బీ శాఖ అచేతనంగా మారింది. చిత్తూరు ఆర్అండ్‌బి సబ్‌డివిజన్ కార్యాలయం ఉద్యోగుల లేమితో జవాబుదారీతనం లేకుండా పోయింది. పలు కీలక పోస్టులు భర్తీకి నోచుకోకపోవడంతో పాలన ఇబ్బందిగా మారింది. ఎక్కడైనా రోడ్డు సమస్య ఉంటే ఎవరికి చెప్పాలి అని తెలియక ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. సబ్ డివిజన్ పరిధిలో చిత్తూరు, జీడీనెల్లూరు నియోజకవర్గాలు, పూతలపట్టు, ఐరాల, నగరి మండలాలు వస్తాయి. ఇటీవల డీఈ నాగమల్లయ్య డిప్యూటేషన్‌పై తిరుపతికి బదిలీ అయ్యారు. దీంతో కుప్పం డీఈకి అదనపు బాధ్యతలు అప్పగించారు. జిల్లా చివరన ఉన్న కుప్పం నుంచి చిత్తూరుకు ఆయన రావడం కష్టతరంగా మారింది. ఇక క్షేత్రస్థాయిలో పనుల పర్యవేక్షణ చూసేది చిత్తూరు, పూతలపట్టు ఏఈలు ఇద్దరే. వీరు పనులు పరిశీలించడం, ఉన్న కార్యాలయ సిబ్బందితో పేపర్ వర్క్ చేయించుకోవడానికే సరిపోతోంది. జీడీ నెల్లూరు, ఎస్ఆర్ పురం, నగరి ఏఈలు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పనిఒత్తిడి దీనికి తోడు తరచూ సమావేశాలు, రిపోర్టులు సిద్ధం చేయడానికి ఉన్న అధికారులకు సమయం చాలడం లేదు. దీంతో కనీస సమాచారం ఇచ్చేవారు దిక్కు లేరు. ఈ పరిస్థితి ఎప్పటికి మారుతుందోనని ఇటు ప్రజలు, అటు అధికారులు అసహనంతో ఉన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి

తవణంపల్లె: రైతులు విత్తనశుద్ధి చేసిన తరువాతనే విత్తాలని వ్యవసాయాధికారి జి. ప్రవీణ్ తెలిపారు. మండలంలోని ద్వారకాపురం సమీపంలో శుక్రవారం రైతులు పొలంలో వేరుశనగ వితనాలు విత్తడాన్ని పరిశీలించారు. రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసిన తర్వాత పొలంలో విత్తనాలు విత్తాలన్నారు. దీని చీడలు, పురుగులు నివారించి మంచి దిగుబడి వస్తుందన్నారు. జిప్సం ఎరువు వాడడం వల్ల మంచి దిగుబడితోపాటు నాణ్యమైన పంట సాధించవచ్చని పేర్కొన్నారు. కలుపు నివారణకు మందులు వాడడం మంచిదన్నారు. రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటను కాపాడుకోవాలని సూచించారు.


రైతులతో మాట్లాడుతున్న ఏవో ప్రవీణ్

ప్రజల ఇళ్ల వద్దకే సేవలందించాలి



మాట్లాడుతున్న కమిషనర్ నరసింహ ప్రసాద్, హాజరైన సర్వీస్ ప్రొవైడర్లు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో ప్లంబింగ్, వడ్రంగి, ఏసీ, ఫ్రీజర్, బ్యూటీషియన్ లాంటి పనులకు ప్రజల ఇళ్ల వద్దకే వెళ్లి చేయాలన్నదే తమ లక్ష్యమని.. ఇందు కోసం ప్రత్యేకంగా ఓ యాప్‌లో వివరాలు నమోదుచేస్తామని మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలోని పట్టణ పేదరిక నిర్మూలనా విభాగం (మెప్మా)లో శుక్రవారం పలు చేతివృత్తులు నేర్చుకున్న సర్వీస్ ప్రొవైడర్లతో సమావేశం నిర్వహించారు. హోమ్ ట్రయాంగిల్ అనే యాప్‌లో చేతివృత్తులు తెలిసిన వాళ్ల పేర్లను నమోదు చేసుకోవాలని, వీటి ద్వారా ఓ మొబైల్ నంబరును ప్రజలకు అందుబాటులో ఉంచుతామన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల ఆధారంగా సర్వీసు ప్రొవైడర్లకు మెసేజ్ వెళుతుందని, పనులు పూర్తి చేసి డబ్బులు తీసుకోవచ్చన్నారు. దీనిపై పూర్తి స్థాయి శిక్షణను త్వరలోనే ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఇంజినీరు వెంకటరామిరెడ్డి, మెప్మా సీఎంఎం వెంకటరమణ, సీవోలు, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

చిన్నతనంలోనే ఉన్నతాశయాన్ని నిర్దేశించుకోవాలి

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులు చిన్నతనం నుంచే ఉన్నత ఆశయాన్ని నిర్దేశించుకోవాలని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కొణిదల శ్రీధర్ అన్నారు. నగరంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద ఉన్న ప్రైవేట్ కల్యాణమండపంలో విజయం సీబీఎస్ఈ పాఠశాల 5వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా టీచర్లు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులపై నిరంతరం ఒత్తిడి చేయకూడదని చెప్పారు. చైర్మన్ తేజోమూర్తి మాట్లాడుతూ ర్యాంకులనే కాకుండా విలువలను, మంచి వ్యక్తిత్వాన్ని కలిగి ఉండేలా తమ విద్యాసంస్థ విద్యార్థులను తీర్చిదిద్దుతోందన్నారు. అకడమిక్ డైరెక్టర్ శైలజ మాట్లాడుతూ విజయం విద్యాసంస్థలు ఇంత విజయవంతంగా విద్యార్థుల అభివృద్ధి కోసం చేస్తోందంటే అందుకు తల్లిదండ్రుల సహకారమేనని చెప్పారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వ్యకృత్వ, క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కౌసల్య, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.




వామనావతారం నాటిక ప్రదర్శనలో ఆకట్టుకున్న విద్యార్థులు, విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న అతిథి కొణిదల శ్రీధర్

రక్తహీనత నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

తవణంపల్లె: గర్భిణులు రక్తహీనత రాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక సూచించారు. మండలంలోని దిగువ తడకరలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని వివరించారు. తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు వాడాలని సూచించారు. రక్తహీనత రాకుండా ఆరోగ్యకమైన ఆహారం తీసుకోవడంతోపాటు ఐరన్ మాత్రలు వాడాలన్నారు. అనంతరం 35 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీహరి, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు, రోగులు పాల్గొన్నారు.

సీజన్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

శీతాకాలంలో సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని ఉప్పాంకలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌వేలు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలిచ్చారు. జ్వరం సోకిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని వివరించారు. గ్రామాల్లో వీధులను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అంటు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దోమ కాటుకు గురికాకుండా దోమ తెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.